ప్రజలకు సమస్యలు రానీయొద్దు

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

తాసీల్దార్లతో వీసీ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం వీసీ ద్వారా తాసీల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. తాసీల్దార్ల పర్యవేక్షణ మరింతగా పెరగాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఎమ్మెల్యేల ద్వారా లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. ఈ-ఆఫీస్ ఫైళ్లను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఈజీఎస్ ద్వారా మంజూరైన పనులను వెంటనే ప్రారంభించారు. ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ అందిస్తున్న క్రమంలో ఇందుకు సంబంధించి తప్పుగా నమోదు చేసిన వారి వివరాలు తెలుసుకొని నమోదు చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇండ్లకు తాసీల్దార్లు తాళాలు వేసి ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, గృహ నిర్మాణ శాఖ ఈఈ భాస్కర్, మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

- నారాయణపేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

అధికారులతో మట్లాడుతున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట, ఫిబ్రవరి 9 : జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని నారాయణపేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ 2024-25 వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మట్లాడుతూ గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని గడిమున్కన్‌పల్లి, కున్సీ, గోకుల్‌నగర్, మాగనూర్, పంచదేవ్‌పాడ్, కన్మనూర్, చిన్నజట్రం, ఉందేకోడ్ గ్రామాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి రూ.57,46,500 బడ్జెట్‌ను సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా కార్యదర్శి సురేశ్‌బాబు, డీఈవో అబ్దుల్ గని, డీపీవో మురళి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

మూసాపేట, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయ యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్‌తో కలిసి అడ్డాకుల మండల కేంద్రంతో పాటు, తిమ్మాయిపల్లి తండా, మూసాపేట మండల కేంద్రంతో పాటు కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లోని సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, బాలనర్సింహులు, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, నాయకులు నాగిరెడ్డి, శెట్టి శేఖర్, కొండా జగదీశ్వర్ పాల్గొన్నారు.

పేట-కొడంగల్ ఎత్తిపోతల అమలుపై హర్షం

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 9 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుడుతూ ప్రభుత్వం 69 జీవో విడుదల చేయడంపై స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మక్తల్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులుపా ల్గొన్నారు.

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, ఫిబ్రవరి 9 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి పరిపాలనా పరమైన అనుమతి లభించడంపై కాంగ్రెస్ నాయకులతోపాటు పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి

- డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా

మక్తల్, ఫిబ్రవరి 9 : నియోజకవర్గంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాంపాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నిజాంపాషా స్వగృహంలో ఏర్పాటు చేసిన పాలఉత్పత్తిదారుల సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో డెయిరీ ఫాంలను ఏర్పాటు చేయడానికి నాబార్డు సంస్థ ముందుకొచ్చిందన్నారు. సంస్థ ద్వారా 15రోజులకు ఒకసారి డబ్బులు చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ జిల్లాలో ఈ డెయిరీ ఫాంలు లాభాలతో నడుస్తున్నాయని తెలిపారు. రైతులు డెయిరీ ఫాంలను ఏర్పాటు చేసుకుంటే నాబార్డు ద్వారా ఆర్థికసాయం అందిస్తామని డీడీఎం అఖిల్ తెలిపారు. సమావేశంలో ఎస్ఐఆర్‌డీ సంస్థ కార్యదర్శి కుర్మయ్య, స్థానిక డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ ఉమా మహేశ్వర్, పాడి రైతు సంఘాల డైరెక్టర్లు జుబేర్ పాషా, పవన్ కళ్యాణ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొ న్నారు.

భార్యను చంపిన కేసులో భర్త అరెస్ట్

బాలానగర్, ఫిబ్రవరి 9 : మండలంలోని నందారం శివారులోని దుందుబీ వాగులో ఈనెల 4న ఓ మహిళ మృతిచెందిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగార్జునగౌడ్, ఎస్సై తిరుపాజీ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలు వారు వెల్లడించారు. రాజాపూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన రాజుతో నందారం గ్రామానికి చెందిన స్వప్న(28)కు ఏడేండ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భర్త మరణించడంతో గండేడ్‌కు చెందిన శ్రీశైలాన్ని రెండో పెళ్లి చేసుకున్నది. కొన్ని నెలలుగా సాఫీగా సాగిన వారి సంసారంలో మనస్పర్థలు రావడంతో విడిపోదామని శ్రీశైలానికి స్వప్న చెప్పింది. ఇందుకు నిరాకరించిన శ్రీశైలం భార్యతో గొడవపడి ఆవేశంతో చీరతో గొంతుకు బిగించి చంపి శవాన్ని దుందుబీ వాగులో పడేసినట్లు తెలిపారు. మృతురాలి తల్లి మీసాల రాములమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తుగా చేపట్టగా, నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు.

SHRIRAM Finance వాహనములు అమ్మబడును

SNo.	VEHICLE ID.	VEHICLE DESCRIPTION	MODEL
1.	TS06EK-9127	MAHINDRA 475 DI	2016

పై వాహనం తేదీ: 10-02-2024 నాడు వేలం వేయబడును
అడ్రస్: శ్రీరామ ఆటోమాల్ యార్డ్, పటాన్‌చెరు
శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్
Door No. 1-5-107/4/2, 2nd Floor, స్టూటౌన్, మహబూబ్‌నగర్
V. Megha Reddy. 9908136553 | Ziauddin Mohd 9949237303

పాలమూరును ఎడారి చేసే కుట్ర

- గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్
- చలో నల్లగొండ పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్‌లో చలో నల్లగొండ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 9 : పదేండ్లలో పచ్చబడిన పాలమూరును తిరిగి కరువు కాటకాలతో అల్లాడించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నట్టు బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం చలో నల్లగొండ కార్యక్రమ వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రాజెక్టులను అప్పగించాలని కేంద్రం ఎంత ఒత్తిడి తీసుకొచ్చినా కేసీఆర్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదన్నారు. తెలంగాణ సాధించుకున్నాక మన హక్కులను కాపాడుకొని కరువుకు నిలయంగా మారిన పాలమూరును పచ్చబడేలా కేసీఆర్ కృషి చేశారన్నారు. వలసలు వెళ్లిన వారంతా తిరిగి గ్రామాలకు చేరుకొని వ్యవసాయం పండుగలా చేసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేక కృష్ణా జలాల విషయంలో సంతకాలు చేసి మరోమారు మహబూబ్‌నగర్‌ను కరువు జిల్లాగా మార్చే ప్రయత్నం చేస్తున్నదన్నారు. తెలంగాణ హక్కులు, కృష్ణా జలాలను కాపాడుకునేందుకు ఈనెల 13వ తేదీన చలో నల్లగొండకు పెద్దఎత్తున రైతులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, గ్రంథాలయాల సంస్థ మాజీ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, నాయకులు గంజి వెంకన్న, గిరిధర్‌రెడ్డి, ఆంజనేయులు, శివరాజ్, వినోద్‌కుమార్, గణేశ్, రవికిషన్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణమోహన్, నర్సింహయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీసీకుంటలో..

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), ఫిబ్రవరి 9: కృష్ణానదీ జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 13న చేపట్టిన చలో నల్గొండ కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు కోట రాము ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించకుండా కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాటు కాపాడుకుంటూ వచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోనే ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిందని, వాటిని కాపాడు కునేందుకు మళ్లీ ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్, రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచాలి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 9 : ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచేలా కృషి చేయాలని డీఆర్‌డీవో యాదయ్య సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో కూలీల సంఖ్య పెంచి పనులు కల్పించాలని సూచించారు. కూలీ చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సుధాకర్, తాసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో జ్యోతి, ఏపీఎం పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అన్నారు. మండలంలోని యన్మన్‌గండ్లలో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వార్డుల్లో పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పత్రాలు లేకుంటే వాహనాలు సీజ్

దేవరకద్ర, ఫిబ్రవరి 9: వాహనాలకు సంబంధించిన ద్రవపత్రాలు లేక పోతే సీజ్ చేస్తామని ఎస్సై నరేశ్ వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని 10 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలకు వెనకా ముందు భాగంలో నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అదేవిధంగా ఆర్సీ, లైసెన్స్ వెంట ఉండాలని లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు పయనం

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 9 : హన్మకొండలో శనివారం నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టు తరలివెళ్లింది.శుక్రవారం జిల్లా కేంద్రంలో క్రీడాకారులను కోచ్, మేనేజర్లు అభినందించారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌బాల్ సీనియర్ కోచ్ సాధిక్‌అలీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోచ్, మేనేజర్లు రాఘవేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ జట్లు..

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 9 : భద్రాది జిల్లాలో నేటి నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్లు తరలివెళ్లాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర వీరిని అభినందించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 9 : జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2019 నుంచి 2023 సంవత్సరాల్లో వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పీయ చిన్నమ్మ శుక్రవారం ట్రస్టుల సహకారంతో పురస్కారాలతోపాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు రవీందర్‌రావు, బీరయ్య, మంజుల, ఉదయకుమార్, ట్రస్టుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మూసాపేట, ఫిబ్రవరి 9 : మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బలిజ శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మహబూబ్‌నగర్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం దవాఖానకు వెళ్లి శేఖర్‌ను పరామర్శించి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే గ్రామ బీఆర్ఎస్ శ్రేణులు రూ. 40 వేలు అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్‌రెడ్డి, మహమూద్, రంజిత్‌రెడ్డి, కావలి కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

వాగు నుంచి ఇసుక తరలించొద్దు

మూసాపేట, ఫిబ్రవరి 9 : మండలంలోని పోల్కంపల్లి సమీపంలోని వాగునుంచి ఇసుక తరలించొద్దంటూ శుక్రవారం గ్రామస్థులు, రైతులు కలిసి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. విషయం తెలిసి ఘటనా స్థలానికి చేరుకున్న తాసీల్దార్ బ్రహ్మంగౌడ్‌తో రైతులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పోల్కంపల్లి పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తుండడంతో సమీపంలోని బోరుబావులు అడుగంటి పంటలు ఎండుతున్నాయన్నారు. ఆన్‌లైన్ ఇసుక పేరుతో ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని గతంలోనే తాసీల్దార్, డిప్యూటీ కలెక్టర్‌కు వినతి ప్రతం అందజేశామన్నారు. కానీ మళ్లీ ట్రాక్టర్లు వచ్చాయని వాటిని ఇక్కడి నుంచి కదలనిచ్చేది లేదన్నారు. తాసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న వాహనాలను అడ్డుకోకూడదన్నారు. అయిన గ్రామస్తులు వాహనాలను కదలనివ్వక పోవడంతో తాసీల్దార్ పోలీసుల సహాయంతో వాహనాలను అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధు, మాజీ సర్పంచ్ నర్సింహులు, మందడి రవీందర్, బాల మాసయ్య, బొడ్డు నర్సింహులు, వెంకటయ్య, ఆంజనేయులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

ధన్వాడ, ఫిబ్రవరి 9 : ప్రజాపాలనలో ఇచ్చిన దరఖస్తుల పరిశీలన వేగవంతం చేయాలని డీపీవో సుదర్శన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖస్తుల పరిశీలనను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ఊట్కూర్, ఫిబ్రవరి 9 : గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో రమేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం నిడుగుర్తిలో ఉపాధి పనులను పర్యవేక్షించి జాబ్‌కార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు నమోదు

దామరగిద్ద, ఫిబ్రవరి 9 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ కోసం స్వీకరించిన దరఖాస్తుల్లో తప్పుగా ఉన్న వివరాలను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు సేకరించారు. 500 మంది దరఖాస్తుదారులు తప్పుడు వివరాలు ఇచ్చారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో సద్గుణ అన్నారు. శనివారం మండలంలోని సంగంబండలో వంటగ్యాస్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం నుంచి వంటగ్యాస్ రూ.500లకే అందించేందుకు ఆదేశాలు రావడంతో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

కురుమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు

దేవరకద్ర రూరల్,(చిన్న చింతకుంట) ఫిబ్రవరి 9: చిన్నచింతకుంట మండలం కురుమూర్తి స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమావాస్యను పురస్కరించుకుని భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

శివపార్వతుల కల్యాణం

దేవరకద్ర, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పస్వామి ఆలయంలో సేవాకార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలవారుజామున అగ్ని గుండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

మక్తల్‌లో..

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 9 : మండలంలో శుక్రవారం అమావాస్య ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో వెలిసిన ఉమామహేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మరికల్‌లో..

మరికల్, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

నారాయణపేట ఏఎస్సీగా రియాజ్

నారాయణపేట, ఫిబ్రవరి 9 : నారాయణపేట అడిషనల్ ఎస్పీగా ఎండీ రియాజ్ ఉల్ హక్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి బదిలీపై నారాయణపేటకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆస్తి పన్ను వసూలు చేయాలి

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 9 : మార్చి 31వ తేదీ వరకు వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయా వార్డుల్లో ప్రత్యేక బృందాలు రూ. 10లక్షల ఆస్తిపన్ను వసూలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సంస్థ నుంచి రూ.5.32 లక్షలు వసూలు చేశారు.కార్యక్రమంలో ఆర్ఐ ముజీబ్ పాల్గొన్నారు.

16న మున్సిపల్ కార్మికుల సమ్మె

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 9 : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు ఎర్ర నర్సింహులు అన్నారు.

పెండింగ్ పారితోషికం చెల్లించాలి

- ఆశా కార్యకర్తలు ధర్నా

ధర్నాకు తరలుతున్న ఆశాకార్యకర్తలు

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 9 : రెండు నెలలుగా పెండింగ్ పారితోషికం వెంటనే విడుదల చేయాలని నారాయణపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆశాకార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రామారెడ్డి, బాల్‌రాం మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదినే వేతనం వేసే ప్రభుత్వం ఆశాకార్యకర్తలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అనంతరం తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, కార్యదర్శి గౌరమ్మ, విజయలక్ష్మి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన ఆశా కార్యకర్తలు

ధన్వాడ, ఫిబ్రవరి 9 : ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ధన్వాడ, మరికల్ మండలాల నుంచి ఆశాకార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెండింగ్ పారితోషికం చెల్లించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు విజయలక్ష్మి, అంజిలమ్మ, మాసమ్మ, మణెమ్మ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 : పారితోషికం ఇవ్వకుంటే ఆశాకార్యకర్తల కుటుంబాలెలా గడుస్తాయని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆశాకార్యకర్తలతో భారీఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్, జనవరి రెండు మాసాలు పారితోషికం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, పారితోషికం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నా రు. వేంటనే వెతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాజ్‌కుమార్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు సావిత్రి, యాదమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 : ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు గారె ఉమ్మడి జిల్లాలో ఈనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లారెన్స్‌రాణి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మహబూబ్‌నగర్‌లో 3,771 మంది, జోగులాంబ గద్వాలలో 4,172, నారాయణపేటలో 2,740 మంది విద్యార్థులకు మొత్తం 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్ల